www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 22 మే 2024

5

అన్నమయ్య



చౌడసముద్రంలో నాకాబందీ

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల పరిధిలోని చౌడసముద్రంలో మొలకలచెరువు ఎస్ఐ తిప్పే స్వామి, డేవిడ్‌రాజ్, పిటియం ఎస్ఐ రవీంద్రబాబు ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఎన్నికల ప్రశాంతంగా ముగిసిన తరుణంలో ఎవరైన అవాం ఛనీయ సంఘటనలకు, ఘర్షణలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనాలు తనిఖీల్లో కర్ణాటక మద్యంతో పట్టుబడితే పిడి యాక్ట్ నమోదు చేస్తామని అన్నారు. వాహనదారులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మొలకలచెరువు పిటియం, బి.కొత్తకోట మండల పోలీసులు ఎఎస్ఐ వెంకటస్వామి, భాస్కర్ నాయక్, హెడ్ కానిస్టేబుళ్లు రమణ, నాగరాజుగౌడ్, పోలీసులు రమేష్‌బాబు, రమణ, సిరాజ్, వెంకటేష్, నరసింహులు, హరి, మూడు మండలాలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

4 వరకు ఉత్కంఠే

- ఆగని కూడికలు, తీసివేతలు
- నాడు ఓటర్ల చుట్టూ... నేడు ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు



ప్రజాశక్తి - పుల్లంపేట

ఎన్నికల పోలింగ్ ముగిసినప్పటికీ, గెలుపోటములపై అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఎడతెగని ఉత్కంఠం కొనసాగుతుంది. కేవలం అభ్యర్థులు, పార్టీ నాయకుల్లోనే కాదు ఆయా పార్టీల కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజల్లోనూ ఇదే రకమైన చర్చ వినిపిస్తోంది. జూన్ 4 న ఓట్ల లెక్కింపు జరగనుంది. అదే రోజు ఫలితాలు కూడా వెలువడతాయి. అభ్యర్థులంతా ఇప్పటికే కూడికలు తీసివేతలతో కుస్తీ పడుతున్నారు. ఎన్ని లెక్కలు వేసుకున్నా ఆ రోజు వరకు వేచి చూడాల్సిందే. పోలింగ్ రోజు వరకు ఓటర్లే దేవుళ్ళుగా భావించి వంగి వంగి నమస్కారాలు చేసిన అభ్యర్థులు, వారి తరపు ప్రచారకర్తలు నేడు గెలుపును ఆకాంక్షిస్తూ గుళ్లు గోపురాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారం రోజుల్లో అభ్యర్థులు భక్తిశ్రద్ధలతో ఆలయాలకు సందర్శించి అనుగ్రహాన్ని కోరుకుంటున్నారు. కానీ నిజరూపం ఓట్ల రూపంలో ఇవిఎంలలోనిక్షిప్తమై ఉంది. ఆయా బాక్సులన్నీ అన్నమయ్య జిల్లా కేంద్రంలో శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల వద్ద భద్రంగా ఉన్నాయి. అభ్యర్థులు ఊహల పల్లకిలో ఊరేగుతున్నారు. అతి నమ్మకంతో ఉన్నవారు విజయోత్సవాలకు కూడా సిద్ధమవుతున్నారు. కేవలం కూటమి, వైసిపి అభ్యర్థులే కాకుండా ఇతర పార్టీలు స్వతంత్రంగా పోటీ చేసిన అభ్యర్థులు కూడా ప్రజా విశ్వాసాన్ని చూరగొనున్నారు.

కూటమి, వైసిపి అభ్యర్థుల గెలుపోటములపై పందేలు కూడా జోరుగానే సాగుతున్నాయి. జనసేన, వైసిపి అభ్యర్థులు ఎవరికి వారే ప్రజలపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నప్పటికీ ఒకరి విజయంతో మరొకరికి అపజయం అనివార్యం అవుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రజలపై విశ్వాసం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు అదే స్థాయిలో ఓటమిని అంగీకరించే పరిస్థితి ఉంటుందా? లేక ప్రజలపై నిందలు దాడులకు తెగించే ప్రమాదం ఉంటుందా? వేచి చూడాల్సిందే. చాలా గ్రామాల్లో ఇప్పటికే ఎన్నికల వేడి చల్లారలేదు. వాస్తవానికి మన జిల్లాలో ఫలితాల సందర్భంలో ఎటువంటి సంఘటనలు జరిగిన దాఖలాలు పెద్దగా లేవు. ప్రస్తుతం జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంది. కానీ పోలింగ్ సందర్భంగా ఇతర జిల్లాలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు దృష్టిలో పెట్టుకొని శాంతి పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

-కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వివరించారు. మంగళవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్ సరఫరా, ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, స్వచ్ఛ భారత్ మిషన్, గ్రామీణ నీటి సరఫరా ద్వారా తాగునీటి ఎద్దడి నివారణ, శాంతిభద్రతలు తదితర అంశాలపై కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరయ్యారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రాయచోటి, సుండుపల్లె తంబళ్లపల్లె, పెద్దమండెం, బి కొత్తకోట, రామసముద్రం, పీలేరు నియోజకవర్గాలలో 13 మండలాలలో తాగునీటి సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున బోర్ వెల్స్, హ్యాండ్ పంప్స్ రీఛార్జ్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షణ చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉపాధి పనులను విరివిగా చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులకు సూచించారు.



విసిలో పాల్గొన్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, అధికారులు

ముఖ్యంగా కరువు మండలాలలో ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే ఆమోదం పొందిన సెల్ఫ్ ఆఫ్ గ్రూప్ పనులను ముమ్మరం చేయాలన్నారు. హౌసింగ్‌లో 90 రోజుల పనులు పూర్తయిన వాటికి బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా వ్యక్తిగతంగా ఇళ్లముందర సోక్ పిట్ ఏర్పాటు చేసుకునేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వేసవికాలం దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరుగుతుందని డిమాండ్ మేరకు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఫలితాలు అనంతరం జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉండేలా తగిన పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

సమావేశాలను విజయవంతం చేయాలి

- వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లి

అంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈ నెల 23, 24 తేదీల్లో హార్సిలీహిల్స్‌లో నిర్వహిస్తారని, ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 1934లో స్థాపించిన వ్యవసాయ కార్మిక సంఘం నేడు కోటిమంది సభ్యులతో దేశవ్యాపితంగా విస్తరించి కష్టజీవుల పక్షాన నికరంగా పోరాడుతుందని వివరించారు. దేశంలో నేటికీ 65 శాతంపైగా ప్రజలు వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ఉద్దేశంతో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఫలితంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దానిపై ఆధారపడి జీవిస్తున్న ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని వాపోయారు. వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, గ్రామీణ ప్రజల జీవితాల మెరుగుదల కోసం వ్యవసాయ కార్మిక సంఘం అనేక ఉద్యమాలు, పోరాటలు చేస్తోందని గుర్తుచేశారు. రాబోయే కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమాల రూపకల్పనకు హార్సిలీహిల్స్‌లో రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశాల్లో అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, అఖిల భారత ఉపాధ్యక్షులు విక్రమ్ సింగ్, రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లుతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరవుతున్నారని తెలిపారు. కరువు ప్రాంతంలో జరుగుతున్న కూలీ సంఘం రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

బ్రహ్మసాగర్
లీకేజీ పనులు పరిశీలన

- త్వరలో జాతీయ స్థాయి నిపుణుల రాక
-జియోఫిజికల్, సీస్మిక్ పరీక్షతో గుర్తింపు
- రూ.52 కోట్ల పనుల్లో కదలిక వచ్చేనా?

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బ్రహ్మసాగర్ రిజర్వాయర్ లీకేజీ పరిశీలన కసరత్తు ఊపందుకుంది. గతంలో ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ సంస్థ రూ.52 కోట్లతో లీకేజీ నియంత్రణ పనులు చేపట్టింది. 100 మీటర్ల పరిధిలోని ఆనకట్ట లీకేజీ పనులను పోలవరం పనుల తరహాలో సిమెంట్ గ్రౌటింగ్ పనులు చేపట్టాల్సి ఉందని నిర్ధారించింది. మట్టికట్టలోని నిర్దేశిత ప్రాంతంలో సిమెంట్ గ్రౌటింగ్ ద్వారా లీకేజీని అరికట్టాలని నిర్ణయించింది. ఆనకట్టలోనికి 36 ప్యానళ్లను చొప్పించింది. ఇక్కడ నుంచి ప్యానళ్ల మధ్య అత్యాధునిక టెక్నాలజీతో కూడిన గ్రౌటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. 36 ప్యానళ్ల మధ్య చేప ట్టాల్సిన సిమెంట్ గ్రౌటింగ్ పనుల వ్యవహారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ప్రభుత్వ ఆమోదం లభించిన అనంతరం రాష్ట్రంలోని సాగునీటి పారుదలశాఖ నిపుణుల సలహాలు, సూచనల సహాయంతో గ్రౌటింగ్ పనులను చేపట్టాలని నిర్ణయించింది. మట్టి కట్టలోని 200వ మీటరులో పలుచోట్ల నీటిచెమ్మ వెలువడుతున్నట్లు గుర్తించింది. త్వరలో జాతీయ స్థాయి నీటిపారుదల సంస్థ సిడబ్ల్యూసీ, జాతీయ ఇరిగేషన్ ఇంజినీరింగ్ నిపుణుల బృందం రానుంది. నాలుగేళ్ల కిందట అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట తెగిన కారణంగా 32 గ్రామాల పరిధిలోని ఆరు గ్రామాలు ముంపునకుగురై 39 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. బ్రహ్మసాగర్ రిజర్వాయర్ లీకేజీ వ్యవహారంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి నిపుణుల బృందం సహాయంతో మట్టికట్టలోని ఎక్కడ నుంచి లీకేజీ అవుతోంది, ఎటువంటి నివారణ పద్ధతులు పాటించాలి, లీకేజీ గుర్తింపునకు అనుసరించాల్సిన పరీక్ష లేమిటనే అంశాలపై మేధోమధనం సాగిస్తోంది. జియో ఫెన్సింగ్, సీస్మిక్ పరీక్షల ద్వారా మట్టికట్ట లీకేజీని గుర్తించనుంది. జాతీయ స్థాయి ఇంజినీరింగ్ నిపుణుల బృందం సూచనలు, సలహాల ఆధారంగా లీకేజీ నివారణ పనులు చేపట్టడంపై దృష్టి సారించింది.



కలుషిత నీరు తాగి 9 నెమళ్లు మృతి

ప్రజాశక్తి-పెద్దముడియం

పెద్ద ముడియం మండలంలోని నెమళ్ళదిన్నె గ్రామ శివారు ప్రాంతమైన కుందూనది ప్రాంతంలో మంగళవారం అనూహ్య వాతావరణ మార్పు వల్ల కలుషిత నీరు తాగి 9 నెమళ్లు మృతుచెందాయి. ఈసందర్భంగా అటవీశాఖాధికారి అశోక్ మాట్లాడుతూ వాతావరణం మార్పు కారణంగా కలుషిత నీరు తాగి కొన్ని నెమళ్లకు కలరా సోకి మృతిచెందినట్లు పోస్టుమార్టంలో తెలిందని తెలిపారు. మరికొన్ని నెమళ్లు కూడా మత్తుగా ఇలాగే ఏటి ఒడ్డునున్న చెట్ల పొదల్లోకి వెళ్లాయని, అవి కూడా మృతిచెంది ఉండ వచ్చని స్థానికులు పేర్కొన్నారు. జాతీయ పక్షిగా విరాజిల్లుతున్న నెమళ్లు ఒకేసారి సమూహంగా మరణించడంతో స్థానికులు విస్మయం చెందారు. గతంలో ఏనాడూ ఇలా ఒకేసారి మరణించ లేదని ఒకింత బాధను వ్యక్తపరిచారు.



మృతిచెందిన నెమళ్లు

ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-కలికిరి

రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారిస్తేనే అధిక దిగుబడులు వస్తాయని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ సూచిం చారు. మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రంలో మహానంది వ్యవసాయ కళాశాల విద్యా ర్థులు రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాడురంగ మాట్లాడుతూ కెవికె శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక దిగుబడులను పొందాలని, విద్యార్థులు గ్రామీణ పంటల సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్.విజయలక్ష్మీ మాట్లాడుతూ రైతులు ఎగుమతికి అనుకూలంగా పంట లు పండిస్తే అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. ఆధునిక వ్యవసాయ పరి కరాలతో నూతన విధానంలో పంటల సాగు చేపట్టాలన్నారు. వేరుశనగ పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, గ్రామంలో పండించే వివిధ పంటల యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు కెవికె వారు తయారు చేసిన వ్యవసాయ ప్రదర్శనలను సందర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ఎ.రాజేష్, డాక్టర్ పి.వి.గీత శిరీష, శాస్త్రవేత్తలు డాక్టర్ మాధురి, డాక్టర్ పీరుసాహెబ్,



ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న కెవికె కో-ఆర్డినేటర్

నవభారత నిర్మాత రాజీవ్‌గాంధీ



రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రెడ్డి సాహెబ్

ప్రజాశక్తి-మదనపల్లి

దేశానికే దిశా నిర్ధేశం చూపిన మహానీయుల మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డిసాహెబ్ అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మదనపల్లె కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని అన్నారు. సమసమాజ స్థాపన కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ప్రపంచంలో ఎక్కడో పుట్టిన కంప్యూటర్ రంగాన్ని మన దేశానికి పరిచయం చేసి ఎంతో మంది విద్యార్థులు సాంకేతిక విద్యను నేర్చుకులనేలా చేసింది రాజీవ్ గాంధీనే అని గుర్తు చేశారు. ఐటీ రంగంలో నేడు ఇండియా అగ్రగామిగా ఉందంటే అది రాజీవ్ గాంధీ కృషి ఫలితమే అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. రాజీవ్ గాంధీ ని ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్న దేశం కోసం నిలబడిన వనిత సోనియా గాంధీ అన్నారు. దేశం కోసం 54 సంవత్సరాల వయస్సులో రాహుల్ గాంధీ పాదయాత్ర చేసిన విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవలసిన విషయం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిమ్మనపల్లె మండల అధ్యక్షులు ముబారక్ ఖాన్, రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు మీనా కుమారి, ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌కే.బాష, రవీంద్ర, మహబూబ్ పీర్, నాగరాజు, మహమ్మద్ అలీ, శ్రీనివాసులు, మస్తాన్, సుబ్రహ్మణ్యం రెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, సోను, నిమ్మనపల్లె నాగరాజు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్

సమగ్ర శిక్ష పథకం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు సమగ్ర శిక్ష పథక జిల్లా సంచాలకులు ఎం.అనురాధను కోరారు. మంగళవారం సాయంత్రం కడప నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమగ్ర శిక్ష పథక సంచాలకులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మదనపల్లి కేంద్రంగా 10 విడతలుగా ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజులపాటు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులందరికీ లీడర్‌షిప్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారని చెప్పారు. శిక్షణ తరగ తులకు హాజరైన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రవాణా భత్యం నేటికీ చెల్లించలేదని సమగ్ర శిక్ష సంచాలకుల దృష్టికి తెచ్చారు. ఆ బకాయిలను వెంటనే సంబంధిత ఉపాధ్యాయులకు చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకో వాలని కోరారు. గత ఏడాది నవంబర్‌లో గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు, అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణా తరగతులకు సంబంధించిన బకాయిలు కూడా చెల్లించలేదని వాటిని తక్షణమే చెల్లించాలని కోరారు. సమగ్ర శిక్ష పథకంలో పనిచేస్తున్న సిఆర్‌పిలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, సమగ్ర శిక్ష పథక ఉద్యోగులందరికీ మూడు నెలలుగా జీతాలు చెల్లించడంలేదని, చాలీచాలని జీతాలు పొందుతున్నప్పటికీ, వాటిని కూడా సకాలంలో చెల్లించకపోవడం వల్లఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని, వెంటనే జీతాల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించి వారికి సకాలంలో చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్ర శిక్ష పథక జిల్లా సంచాలకులు యం.అనురాధ మాట్లాడుతూ సమగ్ర శిక్ష పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ జీతాలు ఒకటి రెండు రోజుల్లో వారి ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. శిక్షణా తరగతులకు సంబంధించిన బకాయిల విషయం రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే చెల్లింపులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, చంద్ర ఓబుల్ రెడ్డి, మస్తాన్ బాషా పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష పథక జిల్లా సంచాలకులకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

'కోడి' కొండెక్కింది..!

అమాంతం పెరిగిన చికెన్ ధరలు - బెంబేలెత్తిపోతున్న మాంసంప్రియులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న చికెన్

ప్రజాశక్తి-పుల్లంపేట

మార్కెట్లో బ్రాయిలర్ చికెన్ ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ తినాలంటే జేబు కాస్త ఖాళీ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని పలువురు వాపోతున్నారు. గత కొద్దిరోజులుగా కొండెక్కి కూర్చున్న చికెన్ ధరలు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఎపితో పాటు తెలంగాణలో కూడా చికెన్ ధరలు భారీగా పెరిగాయని తెలుస్తోంది. గత వారం వరకు కిలో చికెన్ 250 రూపాయల నుంచి 280 మధ్య ఉండగా ప్రస్తుతం మరింత పెరిగి కిలో ఏకంగా రూ.300లకు చేరింది. మరో 15 రోజులు పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వ్యాపారులు అంటు న్నారు. మండుతున్న ఎండలు వాతావరణంలో మార్పుల కారణంగా కోళ్ల ఉత్పత్తి బాగా తగ్గిపోయిందని జూన్ వరకు ఇదే పరిస్థితి ఉంటుందని హోల్‌సేల్ కోళ్ల వ్యాపారులు చెబుతున్నారు. గత వారం 30 గుడ్ల ట్రే రూ.150 రూపాయలు ఉండగా ప్రస్తుతం 150 రూపాయలు దాటి పలుకుతోంది. దీనివల్ల వినియోగదారులతో పాటు చిల్లర వ్యాపారులు సైతం నష్టపోతున్నారని పలువురు వినియోగదారులు అంటున్నారు. ఏది ఏమైనా చికెన్ ప్రియులు ధర చూసి బెంబేలెత్తిపోతున్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నవాబుపేటలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కలకడ

నవాబుపేటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరం కార్యక్రమం గురించి వైద్యాధికారి మాట్లాడుతూ మీ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, యాభై సంవత్సరాలు పైబడిన వారికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. గర్భిణులకు బరువు, ఎత్తు, అధికరక్తపోటు, మూత్ర, రక్త తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అవసరమైన వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్, కాల్షియం, ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ. జి.జయరామయ్య, ఆరోగ్య కార్యకర్తలు శివప్రసాదుబాబు, జె.భాగ్యమ్మ,డేటా ఆపరేటర్ రోజా, పైలెట్ రమేష్‌బాబు, ఆశా కార్యకర్తలు అనంతరాజ్ పాల్గొన్నారు.

వేరుశనగ విత్తన కాయలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రామాపురం

ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులకు 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్నట్లు రామాపురం మండల వ్యవసాయ అధికారి నాగమణి తెలిపారు. మండలానికి కె6 రకం 550 క్వింటాళ్ళు, నారాయణ రకం 790 క్వింటాళ్ళు మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. ఒక బస్తా (30 కిలో) కె6 రకం పూర్తిధర రూ.2850 సబ్సిడీ రూ.1140 పోనూ రైతుకు రూ.1710 రూపాయలకు లభిస్తుందని తెలిపారు. నారాయణి రకం పూర్తి ధర రూ.2910లు సబ్సిడీ రూ.1164 పోనూ రైతువాటా రూ.1746లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రైతు పొలం విస్తీర్ణాన్ని బట్టి కాయలు పంపిణీ ఉంటుందని 0.5 ఉంటే ఒక బస్తా, 0.51 ఎకరాల నుంచి ఒక ఎకరా వరకు ఉంటే రెండు బస్తాలు ఎకరాపైన ఉంటే గరిష్టంగా 3 బస్తాలు పంపిణీ చేస్తామని చెప్పారు. రైతు లందరూ ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న వారికి విత్తన వేరుశెనగకాయలు పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. బుధవారం నుంచి సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు సర్వే

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తించి, వారికి బంగారు భవిత కల్పించడానికి మండల విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష సహకారంతో ఇఆర్‌పిలు కెవిఎస్‌ఎల్ సత్యనారాయణ, బి లలిత సర్వే చేపట్టారు. ప్రత్యేకావసరాల పిల్లలు గతం కంటే ఎక్కువ ఉన్నారనే ఉద్దేశంతో వారికి కూడా బంగారు భవిష్యత్ అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇలాంటి పిల్లలకు విద్యార్థి దశలో విద్యాబుద్ధులు నేర్పించే చర్యలు, ప్రతి బుధవారం ఫిజియోథెరపీ ఇప్పించి వారికి అవసరమైన పరికరాలు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఆయా మండలాల పరిధిలో పూర్తిస్థాయిలో అన్ని రకాల విభిన్నప్రతిభావంతుల పిల్లలను గుర్తించే పనిలో నిమగ్నం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి క్షేత్రానికి విచ్చేసే భక్తులకు శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం కొండాపురం మండలం తాళ్ల ప్రొద్దుటూరు వాస్తవ్యులు రెండెద్దుల నాగేశ్వరరెడ్డి ధర్మపత్ని సరోజేవి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం అందజేశారు. వీరికి ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటం, శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు పేరుపేరునా అభినందనలు తెలిపారు.

మామిడి చెట్లను నరకడం అమానుషం

ప్రభుత్వం ఆదుకోవాలి : పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల అసెంబ్లీ కక్షల అడ్డాగా మారిందని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మారెళ్లమడక గ్రామానికి చెందిన బొజ్జ పార్థసారథి రెడ్డి, వాసుదేవ రెడ్డి, యోగానందరెడ్డి రైతుల మామిడి తోటలో 110 చెట్లను నరకడం అమానుషమన్నారు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పంట కోతకొచ్చే దశలో ఉన్న మామిడి చెట్లను నరికారని తెలిపారు. దాదాపు రూ.8 లక్షల నష్టం వాటిల్లినట్లు వారు తెలిపారు. ఈ చెట్లను మంగళవారం తులసిరెడ్డి పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో ఇలాంటి దుర్ఘటనలు జరగడం శోచనీయమన్నారు. వెంటనే దుండగులను గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తులసిరెడ్డి కోరారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థికసాయం చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీగాల రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమయ్య, రాజా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


నరికేసిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి :ఎంపిపి

ప్రజాశక్తి-కలికిరి

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ అధికారులను ఎంపిపి నూర్జహాన్, ఎంపిడిఒ రామకృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ సమావేశ భవనంలో ఎంపిపి నూర్జహాన్ అధ్యక్షతన ఎంపిడిఒ రామకృష్ణ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్ రెడ్డికి నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం అన్ని శాఖలు జరిగిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒమమతారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వ సబ్సిడీ విత్తనాలు త్వరలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తామని తెలిపారు. ఎంఇఒ కరిముల్లా మాట్లాడుతూ వచ్చే జూన్ 12 లోపల నాడు-నేడు పనులు పూర్తి చేస్తామని, విద్యా కానుక కీట్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వ అధికారులు సన్నాహాలు ప్రారంభించారని తెలిపారు. గుట్టపాలెం సర్పంచ్ వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి కోసం ఆర్‌డబ్ల్యూఎస్ పథకం కింద వేసిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే విద్యు త్ శాఖ స్పందించడం లేదన్నారు. తాగునీరుకి ఇబ్బంది తలెత్తడంతో పాటు సర్పంచ్‌లకు అధికంగా ఖర్చులు భారం పడుతుందని ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌కో ఎఇ రెహమాన్ మాట్లాడుతూ అలాంటి సమస్యలు ఉంటే తెలపాలని పంచాయతీకి సంబంధం లేకుండా వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. డాక్టర్ చిన్న రెడ్డప్ప మాట్లాడుతూ ప్రస్తుతం అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని వ్యాక్సిన్ వేసుకోవాలని కోరారు. ఎంసి పాలెం సర్పంచ్ కాటాబాబు చాలా చెరువులు పూడికతీతలు, చెరువు కట్టలు మర మ్మ తులు చేయాల్సి ఉండగా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవే దన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ పనులను ఇజిఎస్‌తో అనుసంధానం చేసి పను లు చేయవలసిందిగా ఆదేశించారు. అనంతరం ఎంపిడిఒ రామకృష్ణ మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య శాఖ అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పద్మజా లోకవర్ధన్, సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి శ్రీకర్‌రెడ్డి, సర్పంచ్‌లు గంగయ్య, సైపుల్లా, రెడ్డి రామ్, ఎంపిటిసిలు ప్రదీప్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితుడు రిజ్వాన్, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వేంపల్లి నూర్జహాన్

జాతరలో ఆకర్షణీయంగా చాందినీ బండ్లు


ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన చాందినీ బండి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండలం, తలుపుల పంచాయితీ లోని ఉలవల గంగమ్మ జాతరలో చాందినీ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పీలేరు-ఊస్తికాయలపెంట మార్గంలోని తలుపుల సమీపంలో కొలువు దీరిన శ్రీశ్రీశ్రీ ఉలవల గంగమ్మ జాతర చివరి రోజైన మంగళవారం అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. వరపడిన భక్తులు అమ్మవారిని కుల, మతాలకు అతీతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 19వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభమైన మంగళవారంతో ముగిసింది. తిరుణాల మొదటి రోజు రాత్రి మదనపల్లికి చెందిన విజలక్ష్మీ నాట్య కళా మండలి ఆధ్వర్యంలో బాలనాగమ్మ నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. రెండో రోజు మధ్యాహ్నం శ్రీనివాసులు రెడ్డి భాగవతార్ ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం, రాత్రి ఆసాది కథ, కోలాటం, చెక్కభజన బృందాల ప్రదర్శనలు, చాందినీ బండ్ల ఊరేగింపు వైభవంగా జరిగాయి. ఆలయ పూజారి గణేష్‌రాజు ఆధ్వర్యంలో అమ్మవారి అలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేక కైంకర్యాలు జరిగాయి. ఈ జాతర కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షలకు పాత్రులయ్యారు. ఆలయానికి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనానంతరం తీర్థ, ప్రసాదాల వితరణ, దాతలచే అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జె. వెంకట్రమణ నాయుడు, కమిటీ సభ్యులు వై.సాగర్ రెడ్డి, హరినాథ నాయుడు, జె.మల్లికార్జున నాయుడు, గుడి పూజారి గణేష్ రాజు పాల్గొన్నారు.

కథలు మానసిక పరిపక్వతను పెంపొందిస్తాయి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కథలు మానసిక పరిపక్వతను పెంపొందిస్తాయని కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు తెలిపారు. మంగళ వారం పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు బాలబాలికల గ్రంథాలయ ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కథలు వినడం చదవడం వల్ల శ్రవణం, బోధనం పఠన లేఖల సామర్థ్యాలు పెంపొం దుతాయని తెలిపారు. కథల్లో జ్ఞానాన్ని, మంచి, చెడులు, విచక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తుందన్నారు. ఉపాధ్యాయురాలు జీవనజ్యోతి విద్యా ర్థుల కు మెదడుకు మేత అనే అంశంపై నీటి ఉపయోగ ప్రాముఖ్యత, నీటిని ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి వాటిపై వివరించారు. కార్యక్రమంలో విశ్రాం త వైమానిక దళ ఇంజనీర్ వెంకట కొండయ్య, గ్రంథాలయ రికార్డు అసి స్టెంట్ ఇబ్రం సాహెబ్, ఉపాధ్యాయులు గోపి నాయక్, ఓబులేసు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డికె చదువుల బాబు

క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో

అంచెలంచెలుగా ఎదుగుతున్న 'జీవనజ్యోతి'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో జీవనజ్యోతి విద్యాసంస్థలు అంచెలంచెలుగా ఎదుగుతున్నాయని ఆ విద్యాసంస్థల కర స్పాం డెంట్ వై. అమ ర్నాథ్‌రెడ్డి పేర్కొ న్నారు. సమాజానికి ఉత్తమ విద్యను అం దించాలని తద్వా రా దేశ నిర్మాణానికి చక్క టి పౌరులను త యారు చేయాలని 2000వ సం త్సరంలో కేవలం 150 మంది వి ద్యార్థులతో జీవనజ్యోతి తొలి అడుగు వేసిందని ఆయన 'ప్రజాశక్తి'తో పేర్కొన్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు 15 శాఖలు సుమారు 9వేల మంది విద్యార్థులతో దిగ్వి జయంగా ముందుకు పోతోందన్నారు. ప్రొద్దు టూరు పట్టణమంతా 8 శాఖలుగా విస్తరిం చడంతోపాటు జమ్మల మడుగులో ఒకటి, యర్రగుంట్లలో రెండు, పులివెందులలో ఒకటి, తిరుపతిలో మూడు శాఖలను నెలకొల్పారు. ఇన్ని శాఖలున్నప్పటికీ పేద, మధ్య తరగతి కుటుంబికులు సైతం చక్కగా చదువుకునే విధంగా ఫీజులు నిర్ణయించి కార్పొరేట్ స్థాయికి మించి విద్యనందిస్తున్నారు. 20సంవత్సరాలకు పైబడి అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో డిజిటలైజేషన్, కంప్యూటర్ సిస్టమ్ దిశగా విద్యా బోధన సాగుతోంది. క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు ఉల్లాసంగా ఉత్సాహంగా ఆట పాట లతో ఎలాంటి వత్తిడి లేకుండా ఇంటికన్న పాఠశాలలో ఉండడమే బాగుం దన్నట్లుగా విద్యా బోధన సాగుతోందని ఆయన వివరించారు. జీవనజ్యోతి విద్యాసంస్థలు ప్రారంభం నాటి నుండి నేటి వరకు 50మంది విద్యార్థులకుపైగా మెడికల్ సీట్లు సాధించారని తెలిపారు. 460మందికి పైగా ఐఐటిలో, 70మందికి పైగా ప్రభుత్వోద్యోగాలు, 1700 మందికి పైగా మంచి వేతనంతో కూడిన ప్రయివేట్ ఉద్యోగాలతో చక్కటి జీవితాన్ని గడుపుతున్నారన్నారు. మూస పద్ధతిలో కాకుండా విద్యా వ్యవస్థలో ఎప్పటికప్పుడు ఆవిష్కృతమవుతున్న సంస్కరణలతో బోధన సాగుతోందన్నారు. ఇందు కు ప్రతి సంవ త్సరం ఆయా రంగాల్లో నైపు ణ్యం సాధించిన నిపుణులతో జీవనజ్యోతి విద్యా సంస్థల ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వ హిస న్తున్నట్లు కరెస్పాండెంట్ తెలిపారు. చదువులో వెను కబడిన ప్రతి విద్యార్థిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టి మంచి మార్కులు సాధించేలా తయారు చేస్తున్నా మ న్నారు. తమ విద్యాసంస్థలో చదువుతోపాటు మంచి పౌరుడిగా ఎదిగేందుకు అవసరమైన నైతిక విలువలకు కూడా అధిక ప్రాధాన్యతినిస్తూ సమాజం గర్వించే విధంగా విద్యార్థిని తయారు చేస్తున్నామన్నారు. హాస్టల్ వసతి, వ్యాన్ సౌక ర్యం ఉందన్నారు. తమ విద్యాసంస్థల్లో నర్సరీలో చేరిన విద్యార్థి ఇక్కడి వాతావరణానికి ముగ్ధుడై పదవతరగతి వరకూ విద్యను కొనసాగిస్తుండడం వల్ల తమ విద్యా సంస్థల ఉన్నతి దిగ్విజయంగా సాగుతోందని వై.అమరనాధరెడ్డి వివరించారు.

సాహస పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప

భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో జాతీయ సాహస పురస్కారాలలో భాగంగా టెంజింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి. సాయి గ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాలు వివిధ సాహస కృత్యాలు చేసిన వారికి జీవిత సాఫల్య పురస్కారం కోసం అర్హులైన వారి నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఆన్ లైన్ ద్వారా (https://awards.gov.in) జూన్ 14 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు -9949298810, జూనియర్ అసిస్టెంట్ టి. నాగయ్య 9849497011 నంబర్లకు ఫోన్ ద్వారా కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు వాల్మీకిపురం మండల సమావేశం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఈ నెల 23వ తేది గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపి డిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 2024 ఎన్నికల నియమావళిని అనుసరించి ఈ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశం నందు గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సమగ్ర శిక్ష ప్రగతిపై సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన సూచించారు.

ఎపిఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - మైదుకూరు

పట్టణంలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం ఎపిఎస్‌పిడిసిఎల్ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు, ఉమ్మడి కడప జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ రమణ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఇ రమణ మాట్లాడుతూ కలెక్టర్ పిలుపుమేరకు ప్రజల దాహం తీర్చేందుకు జిల్లాలో పలుచోట్ల ఉచిత మంచినీటి చలివేంద్రాలు, ఉచిత మజ్జిగ వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మైదుకూరులో ఉచిత మజ్జిగ, మంచినీటి వితరణ కేంద్రం ద్వారా రోజుకు దాదాపు 500 మంది ప్రజల దాహం తీరుతుందన్నారు. చలివేంద్ర పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మానవతా దృక్పథంతో ప్రజలు స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయుటలో ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మైదుకూరు సబ్ డివిజన్ డిఇఇ శ్రీనివాసలరెడ్డి, మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, దువ్వూరు మండలాల విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - దువ్వూరు

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి మైఖేల్ రాజీవ్ పేర్కొన్నారు. దువ్వూరు మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఉద్యాన డిడి మైఖేల్ రాజీవ్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సుగుణ శ్రీ, తహశీల్దార ఉమారాణి, ఇతర మండల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి మండలంలోని అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు సాధించవచ్చు అని ఆయన తెలిపారు. పక్కా గృహాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమస్యలను తెలుసుకొని ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా పరిష్కరించాలన్నారు. మండలంలోని సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ శాంతి, పిఆర్ ఎఇ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శివకుమార్, ఉపాధి హామీ ఎపిఒ వసంతకుమార్, వెలుగు ఎపిఎం శ్రీధర్ పాల్గొన్నారు.

పది రోజుల ముందే ఏజెంట్ల వివరాలివ్వాలి


అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమావేశంలో ఆర్‌ఒ వెంకటేశు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఎన్నికల కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్ల వివరాలను కనీసం 10 రోజుల ముందే తమకు అందజేయాలని ఆర్‌ఒ వెంకటేశు సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం పోటీలో ఉండే అభ్యర్థులు, వారి తరపున వచ్చిన ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్‌కు హాజరై అభ్యర్థుల తరుపు ఏజెంట్లకు సంబంధించిన సమాచారాన్ని వారం రోజులు ముందుగా తెలియజేస్తే విచారణ అనంతరం వారికి కౌంటింగ్ పాసులు అందజేస్తామన్నారు. జూన్ 4న తొలిత పోస్టల్ బ్యాలెట్ లెక్కిస్తారన్నారు. సమాంతరంగా ఇవిఎంల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్రంలో ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో గరిష్టంగా 14 మంది ఏజెంట్లను అనుమతిస్తారని తెలిపారు. ఫారం-17సీలో నమోదు చేసిన ఓట్లను ఇవిఎంల్లో నిక్షిప్తమైన ఓట్ల సంఖ్యతో సరి చూస్తారని కౌంటింగ్ సిబ్బంది ఆ సంఖ్య ఫారం-17సి పార్ట్-2 నోట్ చేసుకొని దానిపై ఏజెంట్ల సంతకం తీసుకుంటారన్నారు. ఇవిఎంల్లో పోలైన ఓట్లతో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే వివరాలను కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన బోర్డుపై సిబ్బంది రాస్తారన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసి భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. శాంతియుతంగా లెక్కింపు ప్రక్రియ నిర్వర్తించడంలో అందరూ బాధ్యత తీసుకోవాలని ఆర్‌ఒ కోరారు. సమావేశంలో అభ్యర్థులు వారి తరపున ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హౌసింగ్ నిర్మాణాలు వేగవంతం చేయండి

సింహాద్రిపురం : మండలంలో జరుగుతున్న హౌసింగ్ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఎపిఎంఐపి పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రమైన సింహాద్రిపురం ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఆయన హౌసింగ్ నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సిబ్బంది ఇచ్చిన లక్ష్యాల మేరకు నిర్మాణాలను పూర్తిచేయాలని తెలిపారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణంలో ఆగి ఉన్న దశను గుర్తించి ఆయా లబ్ధిదారులతో చర్చించి త్వరగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు సంబంధించి సిమెంటు, ఇతరత్రా వాటిని సిబ్బంది నిర్లక్ష్యం లేకుండా వెంటనే అందించాలన్నారు. హౌసింగ్ నిర్మాణాల లక్ష్యాల పూర్తిలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సల్మాన్ రాజ్, తహశీల్దార్ భీమేశ్వరరావు, హౌసింగ్, పంచాయతీరాజ్ ఎఇలు వాసుదేవరెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, జనీ రింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్ రెడ్డి

క్రైం కార్నర్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

-ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీ పరిధిలో మంగళవారం హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుల వివరాల మేరకు..హైదరాబాదు నగరం జీడిమెట్లకు చెందిన సురేంద్రరెడ్డి, రేణుకారెడ్డి, రమాదేవి, దిక్షీతరెడ్డి, కృతిరెడ్డిలు తిరుమల యాత్రకు వెళ్లి తిరిగి హైదరాబాదుకు వెళ్లే క్రమంలో రైల్వేకోడూరు సమీపంలోని రాఘ వరాజుపుం వద్ద పెట్రోలు బంకు సమీపంలో ఆగివున్న లారీని ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ప్రమాద సమయంలో అక్కడే ఉన్న జనసేన నాయకులు ముత్యాల కిషోర్ కుమార్, నాగోలు అమర్నాథ్ వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం . క్షతగాత్రులను రాఘవరాజుపురంకు చెందిన బద్రి, చంద్రలు అమర ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రాణాపాయం తప్పిందని అమర ఆస్పత్రి వైద్య బృందం తెలిపారు.

విత్తన ఎంపిక, ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం, వర్షాలు కూడా ఆడపాదడపా పడుతుండడంతో రైతులు పంటలసాగుకు సమాయత్తం అవుతున్నారు. పొలాలు సేద్యానికి అనుకూలం కావడంతో పదును దుక్కులకు సిద్ధపడుతున్నారు. దుక్కులతోపాటు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని వ్యాపారులు మాయమాటలతో నాసిరకం విత్తనాలు, సస్యరక్షణ మందులను అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో చాలా చోట్ల నాసిరకం విత్తనాలతో పంటలో ఎదుగుదల లేక రైతులు ఆర్థికంగా నష్టపోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. గతంలో మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె, వెదురూరు, రాజుపాలెం, వీరభద్రపురం తదితర గ్రామాల్లో నకిలీ వడ్ల విత్తనాలు తెచ్చుకుని రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి మ్యాగీ సూచిస్తున్నారు. గుర్తింపు పొందిన తయారీ సంస్థల నుండి విత్తనాలు, ఎరువులు, మందులు వాడడం వల్ల చాలా వరకు ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు. ఒకవేళ ఏదైనా సమస్య వస్తే కంపెనీ దృష్టికి తీసుకు వెళ్లి నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి వివరాలు లేకుండా ఇచ్చే వాటిని కొనుగోలు చేయడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని, ముఖ్యంగా కొనుగోలు సందర్భంలో వ్యాపారుల నుంచి తప్పకుండా రసీదు తీసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. నష్టం వాటిల్లిన సందర్భంలో వారిపై కేసు నమోదు చేయించి రైతులకు పరిహారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రసీదు పొందకపోతే రైతుకు ఎలాంటి ఆధారం ఉండదన్నారు. విత్తనాల విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. విత్తనాలు విత్తే ముందు మొలక శాతం పరీక్షించుకోవడం వల్ల నాణ్యత ముందుగానే తెలుసుకోవచ్చునని తద్వారా విత్తనాల నాణ్యతను నిర్ధారించుకోవచ్చంటున్నారు. విత్తనాలు కొనుగోలు సందర్భంలో సంచులపై ఉండే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయడం మంచిదంటున్నారు. సీల్ నెంబర్, కాలపరిమితి తప్పనిసరిగా సరిచూసుకోవాలని, లేని వాటిని గుర్తించాలని అంటున్నారు. కొనుగోలు చేసిన తర్వాత బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. పురుగు మందుల కొనుగోలు సందర్భంలో ఐఎస్ఐ నెంబర్ ఉన్న వాటిని తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అలాగే వ్యవసాయ అధికారుల నుంచి అనుమతి కలిగిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించడం, వారి నుంచి సలహాలు తీసుకోవడం ఉత్తమం అంటున్నారు. రైతులు సేకరించిన విత్తనాలు, ఎరువుల నాణ్యతను ల్యాబ్‌లో పరీక్ష చేయించుకోవచ్చునని అదికారులు సూచిస్తున్నారు.


చాపాడు మండంలోని పొలంలో విత్తనం వేస్తున్న కూలీలు